క్లుప్తంగా

ఘనంగా శ్రీకాలభైరవ హోమం



తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం శ్రీకాలభైరవ హోమం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో ఈ నెల 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు హోమ మహోత్సవాలు చేపట్టారు. ఇందులో భాగంగా యాగశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పూజ, అష్టభైరవ హోమం, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాశాంతి అభిషేకం, నివేదన, హారతి నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు శ్రీనవగ్రహ కలశస్థాపన, పూజ, జపం, హోమం, విశేష దీపారాధన చేపట్టారు. మంగళవారం నవగ్రహ హోమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

రేపు జగనన్నకు చెబుదాం

చంద్రగిరి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో బుధవారం చంద్రగిరిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలాజీ నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మురళీకృష్ణ దేవాలయ కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభించే ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి హాజరు కానున్నారన్నారు. మండలంలోని ప్రజలందరూ వారి సమస్యలను సంబంధిత కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా పురుషుల దినోత్సవం



ఎంఈఓలను సత్కరిస్తున్న జెడ్పీటీసీ, ఉపాధ్యాయినులు

పాకాల: ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో పురుషుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో పురుషుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి అధ్యక్షతన ఎంఈఓ బాబ్జీ, ఎంఈఓ-2 లింగయ్యలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ నవంబర్ 19వ తేదీన అంతర్జాతీయ పురుషుల దినోత్సవమని, ప్రతీ పురుషుడు వెనుక ఒక స్త్రీ ఉన్నట్లు, ప్రతీ స్త్రీ వెనుక ఒక పురుషుడు ఉంటాడని గుర్తు చేశారు. అనంతరం ఎంఈఓలతో పాటు, పురుష ఉపాధ్యాయులకు పూలమాల వేసి, శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ అనుసంధానం

తిరుపతి అర్బన్: కొత్తగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకునే వ్యాపారులు బయోమెట్రిక్‌తోపాటు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తిరుపతి వాణిజ్య పన్నులశాఖ కార్యాలయ అధికారులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అలా చేయడంతో వ్యాపారుల ఫోన్ నెంబర్‌కు లేదా మెయిల్‌కు ఎప్పటికప్పుడు పూర్తి సమాచారం అందుతుందని వెల్లడించారు. అనుసంధానం చేసే సమయంలో ఫొటోను అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. అప్‌లోడ్ చేసిన అన్ని డాక్యుమెంట్స్‌ను తిరుపతి, చిత్తూరు జిల్లాకు చెందిన వారు చిత్తూరులోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

పాలియేటివ్ కేర్ రోగులకు వరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్విమ్స్ డైరెక్టర్

తిరుపతి తుడా: వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఇందులో ఇటీవల పుట్టుకొచ్చిన పాలియేటివ్ కేర్ వైద్య విధానం రోగులకు ఒక వరంగా మారిందని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ.కుమార్ పేర్కొన్నారు. స్విమ్స్ శ్రీపద్మావతి ఆడిటోరియంలో సోమవారం పెయిన్ పాలియేటివ్ కేర్ వింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేన్సర్ రోగులకు మాత్రమే ఇప్పటి వరకు పరిమితమైన పెయిన్ పాలియేటీవ్ కేర్ వైద్యం ప్రస్తుతం మరికొన్ని విభాగాల విస్తరించిందన్నారు. శస్త్ర చికిత్సలు చేసుకున్న వారికి ఈ వైద్య విధానం నొప్పులు తగ్గించేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరువనంతపురానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ రాధా వెంకటేషన్, వైద్యాధికారులు అల్లాడి మోహన్, ఉషాకళావత్, జయచంద్రారెడ్డి, మాధవి, కోటిరెడ్డి, సుధారాణి, నాగరాజు పాల్గొన్నారు.

మెకానిక్స్‌కు ఉచిత వైద్య సేవలు

తిరుపతి కల్చరల్: బాలాజీ టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలవారీ సమావేశంలో భాగంగా సోమవారం యూత్‌హాస్టల్లో మాక్ అయిల్ ఆధ్వర్యంలో మెకానిక్స్‌కు ఉచిత వైద్య సేవలు అందించారు. గుండె, ఎముకల విభాగాలకు చెందిన వైద్య నిపుణులు మెకానిక్స్‌కు ఈసీజీ, ఎముకల సాంద్రత వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు ఎస్ఆర్.బాషా, కృష్ణారెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి సాయికిరణ్, కోశాధికారి విశ్వనాథ్, సహాయ కార్యదర్శి మోహన్, కమిటీ ఇన్‌చార్జ్ సేతు ఆచారి, యూత్‌హాస్టల్ మేనేజర్ మోహన్‌రెడ్డి, మెకానిక్‌లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు



కార్తీక మాసం తొలిసోమవారం కపిలేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి, దీపాలను వెలిగిస్తున్న భక్తులు



కపిలేశ్వరస్వామి ఆలయంలో నెమలి వాహనంపై ఉభయ దేవేరులతో శ్రీసుబ్రమణ్యస్వామి



మంగళంలోని అన్నపూర్ణ సమేత ఈశానేశ్వర నవలింగ క్షేత్రంలో ప్రత్యేక అలంకరణ



ఈశానేశ్వర నవలింగ క్షేత్రంలో శివయ్యను దర్శించుకున్న భక్తులు

తిరుపతి కల్చరల్: కార్తీకమాసంలో దీపారాధన చేయడంతో కష్టాలు తొలగి పుణ్యఫలాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. కార్తీకమాసంలో తొలి సోమవారం నాడు ఆధ్యాత్మిక తిరుపతి నగరంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయం, దేవేంద్ర థియేటర్ వద్దనున్న శివాలయం, మంచినీళ్ల గుంట వద్ద నున్న శివాలయం, మంగళంలోని అన్నపూర్ణ సమేత ఈశానేశ్వర నవలింగ క్షేత్రంలో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి దీపారాధన చేపట్టారు. దీంతో శివాలయాలు భక్తులతో కిక్కిరిసిశాయి. కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో ఉదయం నుంచి శ్రీకపిలేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కపిలతీర్థంలోని పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి శివలింగాలకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అలాగే నిమ్మ, ఉసిరి కాయలు, పిడి దీపాలు వెలిగించి పూజలు చేపట్టారు. అనంతరం శ్రీకపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు, శ్రీసుబ్రమణ్యస్వామి, గణపతి స్వామి ఆలయాల వద్ద దీపారాధనలు, పూజలు చేశారు. సాయంత్రం కూడా మహిళా భక్తులు శివాలయాలు, కపిలతీర్థంకు చేరుకొని దీపారాధనలు చేశారు. అలాగే మంగళంలోని అన్నపూర్ణ సమేత ఈశానేశ్వర నవలింగ క్షేత్రంలో కార్తీక మాసం పూజలు చేసి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. నవలింగ క్షేత్రంలో సోమవారం చేపట్టిన కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పాల్గొని పూజలు చేశారు.

కార్తీక దీపాలతో భక్తుల సందడి

భాకరాపేట: కార్తీక సోమవారం చిన్నగొట్టిగల్లులోని శ్రీభీమేశ్వర స్వామి ఆలయంలో దీపాలతో భక్తుల సందడి నెలకొంది. సాయంత్రం నుంచి ఆలయ మూల విరాట్ నుంచి ధ్వజ స్తంభంపై కార్తీక దీపం వరకు దీపాలు పెద్ద ఎత్తున వెలిగించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు చిన్నారి స్వామి మాట్లాడుతూ సోమవారం రోజున చేసే పూజలు శివుడికి ప్రీతిని కలిగిస్తాయని అన్నారు. తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామి ఆలయంలో కూడా పెద్ద ఎత్తున భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణం అంతా దీపాలతో ప్రత్యేక ఆకర్షణగా వెలుగులను నింపుకుంది.

రహదారులతోనే అభివృద్ధి సాధ్యం



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న భూమన అభినయరెడ్డి

తిరుపతి తుడా: రహదారుల అభివృద్ధితో తిరుపతికి కొత్త శకం మొదలైందని నగర డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి అన్నారు. కొంకా చెన్నయ్య గుంట వంద అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్ అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. భూమన అభినయరెడ్డి మాట్లాడుతూ రెండేళ్లలోనే 18 మాస్టర్ ప్లాన్ రోడ్లతో పాటు పలు లింక్, కనెక్టివిటీ రహదారులను నిర్మించామన్నారు. కొత్తగా మరో ఐదు వేల ఎకరాల్లో తిరుపతి విస్తరించనుందని తెలిపారు. వంద అడుగుల కొంకా చెన్నయ్య గుంట రోడ్డును త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. డీఈఈ విజయకుమార్‌రెడ్డి, నరేంద్ర పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: ప్రజల నుంచి వచ్చే స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను హెచ్చరించారు. సోమవారం కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్పందన డయల్ యువర్ కమిషనర్ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, వివిధ విభాగాధికారులతో కలిసి నిర్వహించారు. ఇందులో డయల్ యువర్ కమిషనర్‌కు 6, స్పందనకు 17 ఫిర్యాదులు అందాయి. అక్కారాంపల్లి సమీపంలోని వెల్డింగ్ షాపు నిర్వహణతో శబ్ద కాలుష్యం ఎక్కువగా ఉందని, శ్రీదేవి కాంప్లెక్స్ వద్ద తిలక్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేయాలని, రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని ఫిర్యాదులు అందాయి. వీటిపై స్పందించిన కమిషనర్ వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. డెప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, కార్యదర్శి రాధిక, డీసీపీ శ్రీనివాసులురెడ్డి, రెవెన్యూ అధికారులు కేఎల్.వర్మ, సేతుమాధవ్ పాల్గొన్నారు.

తిరుపతి అభివృద్ధి టీటీడీ బాధ్యత



మాట్లాడుతున్న తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ రాజు

తిరుపతి కల్చరల్: నిత్యం శ్రీవారి భక్తులు, యాత్రికులు తొలి అడుగిడే తిరుపతి నగరంలో సమగ్ర పారిశుధ్య నిర్వహణ కోసం నిధులు కేటాయించి తద్వారా యాత్రికులకు, స్థానిక ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడాల్సిన బాధ్యత టీటీడీపై ఉందని తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ రాజు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. యాత్రికులకు మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ నిధులు తిరుపతి అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయింపు విషయంపై రాజకీయ దుమారం సరికాదన్నారు. టీటీడీకి చెందిన సత్రాలు, అతిథి గృహాలు, హాస్పిటల్స్, విద్యాసంస్థలు, కల్యాణ మండపాలు తిరుపతి నగరంలో ఉన్నాయని, ఈ ప్రాంతాలను ఆశ్రయించే యాత్రికులు, భక్తులు, ఇతర ప్రాంతాల ప్రజల కారణంగా ఆయా ప్రాంతాలలో పారిశుధ్య సమస్య లేకుండా ఆరోగ్య కరమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం టీటీడీపై ఉందని తెలిపారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి వాసుదేవన్, కోశాధికారి అయ్యప్ప, ఉపాధ్యక్షులు కేవీ.సత్యనారాయణ, మల్లిశెట్టి రవి, ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షుడు తమటం రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిస్తాం



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించాలని ప్రచారం చేస్తున్న అధికారులు



విద్యార్థినులకు స్వీట్లు పంచుతున్న తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.సంధ్యారాణి

తిరుపతి లీగల్: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తిరుపతి లేబర్ ఆఫీసర్ బాలునాయక్ తెలిపారు. తిరుపతి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం దిశ పోలీస్ స్టేషన్ వద్ద న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికులను గుర్తించి వారిని పాఠశాలలకు పంపించే విధంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దిశ స్టేషన్ డీఎస్పీ కాటమరాజు, పోలీస్ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మంచి నడవడికతో ఎదగాలి

బాలికలు మంచి నడవడికతో ఎదగాలని తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.సంధ్యారాణి తెలిపారు. సోమవారం ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని బాలికల పరిశీలన గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సును తిరుపతి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యార్థినులకు అధికారులు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పరిశీలన గృహం సూపరింటెండెంట్ నయోమి, మహిళా న్యాయవాదులు మల్లీశ్వరి, సీడబ్ల్యూసీ సభ్యులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

బాలకార్మిక రహిత జిల్లాగా తిరుపతి

తిరుపతి రూరల్: బాలకార్మిక రహిత జిల్లాగా తిరుపతిని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్మికశాఖ తిరుపతి ప్రాంతీయ ఉప సంచాలకులు బాలునాయక్ పేర్కొన్నారు. పాన్ ఇండియా బాల కొమార కార్మికుల రక్షణ, పునరావాస టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతిలో బాలకార్మిక నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్మికశాఖ, జిల్లా న్యాయసాధికారికత సంస్థ, పోలీస్, విద్యాశాఖాధికారులతో కూడిన ఈ టాస్క్‌ఫోర్స్ బృందం పలు ఇటుకబట్టీలు, దుకాణాలు, సంస్థలు, హోటల్స్‌పై తనిఖీలు చేశారు. బాలలతో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా డీసీఏల్ బాలునాయక్ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏసీఎల్ కృష్ణారెడ్డి, దిశా డీఎస్పీ కాటమరాజు, ఏఎల్ఓ శ్రీమన్నారాయణ, రాజయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల నిలయం.. గ్రంథాలయం



వారోత్సవాల్లో విద్యార్థులతోపాటు గ్రంథాలయాధికారులు

తిరుపతి అర్బన్: పోటీ పరీక్షలతోపాటు జ్ఞానాన్ని ప్రసాదించే అన్నిరకాల పుస్తకాలు, దినపత్రికలు లభించే నిలయం గ్రంథాలయమని గ్రంథాలయాధికారి సూర్యనారాయణమూర్తి పేర్కొన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని తిరుపతి గోవిందరాజులస్వామి ఆలయం సమీపంలోని ప్రాంతీయ గ్రంథాలయంలో వారోత్సవాలు చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిజిటల్ గ్రంథాలయాలుగా మార్పు చేయడంతో మెరుగైన వసతులు, పుస్తకాలు అందుబాటులో వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కస్తూరి, సునీల్‌బాబు, మనోజ్‌బాబు, రాధమ్మ, భారతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజేష్ కుమార్‌కు డాక్టరేట్




తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈలో పరీక్షల నియంత్రణాధికారిగా పనిచేస్తున్న పి.రాజేష్‌కుమార్‌కు కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగాధిపతి రమేష్‌బాబు పర్యవేక్షణలో ఏ స్టడీ ఆఫ్ సమ్ పెరిస్టాటిక్ ఫ్లోస్ త్రూ ఛానల్స్ విత్ పెర్మిబల్ వాల్స్ అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పించారు.

మధ్యతరగతి కుటుంబాల ఇతివృత్తమే ఎంసీఎం

తిరుపతి కల్చరల్: యూత్ స్ట్రీక్స్ నిర్మాణ సారథ్యంలో ప్రస్తుత సమాజంలో మధ్య తరగతి కుటుంబాల కథను ఇతివృత్తంగా రూపొందిస్తున్న చిత్రమే ఎంసీఎం (మిడిల్ క్లాస్ మెమొరీస్) అని ఈ చిత్రం దర్శకుడు ఎస్‌కే.దర్బార్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన చిత్ర నటులతో కలిసి ఎంసీఎం చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్లు ఆవిష్కరించారు. తిరుపతి కళాకారులతో చిత్రం మొత్తం పరిసర ప్రాంతాల్లో సినిమాను చిత్రీకరించనున్నట్లు తెలిపారు. పునీత్ సాయి, కార్తీక్, మనోజ్, సుమతి, నీరజ, రేవతి, లక్ష్మి పాల్గొన్నారు.

వారపు సంతలో భోజనాలు



వారపు సంతలో భోజనాలు వడ్డిస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

పాకాల: ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో నిర్వహిస్తున్న వారపుసంతలో రైతులు, వ్యాపారులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు తమ సొంత నిధులతో భోజనాలను అందజేస్తున్నారు. సోమవారం స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకుల చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నలు ఆకలితో అలమటించకూడదని, వ్యాపార సమయంలో భోజనానికి ఇబ్బందులు పడకూడదని సన్న, చిన్నకారు రైతులకు, వ్యాపారులకు ఈ భోజనాలు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. మండలంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగే వారపు సంతల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలకు ఉచిత వైద్య సేవలు



బాలికలకు వైద్య పరీక్షలు చేస్తున్న రమాదేవి మల్టీ స్పెషాలిటీ వైద్యులు

తిరుపతి తుడా: సరోజినీ దేవి రోడ్డులోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలోని సోమవారం బాలికలకు ఉచిత వైద్య సేవలను అందించారు. బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా శ్రీరమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బాలికలకు వైద్య పరీక్షలు అందించారు. డాక్టర్ వంశీకృష్ణ తేజ, డాక్టర్ చక్రధర్‌రావు, పర్యవేక్షణాధికారి సి.నయోమి, డాక్టర్ ఎస్.జయశ్రీ, అజ్మల్ బాషా పాల్గొన్నారు.

ఆటపాటలతో మానసిక ఉల్లాసం



టౌన్‌బ్యాంక్ సహకార వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: నిత్యం పనిఒత్తిడితో సతమతమవుతున్న టౌన్‌బ్యాంక్ ఉద్యోగులకు ఆటలు-పాటలతో మానసిక ఉల్లాసం పొందుతారని, తద్వారా బ్యాంక్ ఖతాదారులకు మరింత సేవలను అందించగలుగుతారని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్(టౌన్‌బ్యాంక్)లో గత వారం రోజులుగా బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఉద్యోగులకు క్రికెట్, సెటిల్, మ్యూజికల్ చైర్స్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు సోమవారం ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి బహుమతులను అందజేశారు. టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి సహాయ సహకారాలతో టౌన్‌బ్యాంక్ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. కో-ఆపరేటివ్ జిల్లా అధికారి శ్రీనివాసులురెడ్డి, జిల్లా ఆడిటర్ నాగవర్ధిని, జిల్లా రిజిస్ట్రార్ రవిబాబు, బ్యాంక్ ఎండీ శివకుమార్‌రెడ్డి, బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, డైరెక్టర్లు మహ్మద్‌కాసీమ్ చోటా, పోలిరెడ్డి నాగిరెడ్డి, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, మబ్బు నాదమునిరెడ్డి, వెంకటేష్‌రాయల్, అనీల్‌రాయల్, బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్రయ్య, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ



వధువు కుటుంబ సభ్యులకు పెళ్లికానుకను అందిస్తున్న నాయకులు

చంద్రగిరి: ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందజేసిన ఎమ్మెల్యే వివాహ కానుకను వైఎస్ఆర్ సీపీ నాయకులు నూతన వధూవరులకు అందజేశారు. సోమవారం మండల పరిధిలోని పనపాకం పంచాయతీ అమాసవారిపల్లి చెందిన త్రివేణి, శివప్రకాష్ తోపాటు అదే గ్రామానికి చెందిన అపర్ణ, నగేష్‌లకు వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ వెంకరత్నం ఆధ్వర్యంలో నాయకులు నూతన వధూవరులకు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపించిన బంగారు తాళిబొట్టు, పట్టువస్త్రాలు, శ్రీవారి లడ్డూ-వడ, అమ్మవారి పసుపు-కుంకుమ, వెండి మెట్టెలతో కూడిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు పానేటి చెంగల్రాయులు, మాజీ సర్పంచ్ గోపాల్, నాగేశ్వరరావు, భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పరుగులు



సీసీరోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి

తిరుపతి రూరల్: ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి కొనియాడారు. తుడా నిధులు రూ.13 లక్షలతో సీగొల్లపల్లి పంచాయతీలో నిర్మిస్తున్న సీసీరోడ్లకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ వందలాది కోట్ల అభివృద్ధి పనులతో దేశంలోనే ఆదర్శ అసెంబ్లీ నియోజకవర్గంగా చంద్రగిరిని తీర్చిదిద్దిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డిలకే దక్కిందన్నారు. ప్రజాసేవను బాధ్యతగా స్వీకరించిన మనసున్న రాజకీయ నాయకుడు ఎమ్మెల్యే భాస్కర్‌రెడ్డి అన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి ఒక యజ్ఞంలా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారని కొనియాడారు. సీగొల్లపల్లి వంటి చిన్న పంచాయతీ లోనూ దాదాపు రూ.6.50 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విడుదల రవి, పంచాయతీ కార్యదర్శి జ్యోతిలత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే చిన్నారికి అభినందనలు



చిన్నారిని అభినందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- ఆల్ ఇండియా చాంపియన్ షిప్ పోటీల్లో కుంట్రపాకం చిన్నారి విశేష ప్రతిభ
- ఫైట్‌లో స్వర్ణం, కటాలో వెండి పతకాలు కైవసం
- ప్రత్యేకంగా అభినందించిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తిరుపతి గ్రామీణ మండలానికి చెందిన చిన్నారి వెన్నెల తన ప్రతిభతో మెరిసింది. కరాటేలో నిర్వహించిన ఫైట్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించగా కటాలో వెండి పతకాన్ని సొంతం చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తిరుపతి గ్రామీణ మండలం కుంట్రపాకం గ్రామానికి చెందిన హరిబాబు, కవితల కుమార్తె వెన్నెల తిరుపతి నగరంలోని రత్నం గ్లోబల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. కరాటేపై ఆసక్తి చూపడంతో తల్లిదండ్రులు ఆమెను ప్రోత్సహించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చి తిరుపతిలో కరాటే మాస్టర్‌గా శిక్షణా కేంద్రం నడుపుతున్న సింహాచలం వద్ద శిక్షణ ఇప్పించారు. ఈ క్రమంలో ఈ నెల 17వ తేదీన తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో వెన్నెలకు అవకాశం కల్పించారు. తన కోచ్ సూచనల మేరకు వెన్నెల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని విజేతగా స్వర్ణం, వెండి పతకాలను సాధించుకుంది. దేశ వ్యాప్తంగా 8 రాష్ట్రాల నుంచి 1250 మంది పోటీలో పాల్గొనగా అండర్-13 బాలికల విభాగంలో వెన్నెల తన ప్రతిభను చాటుకున్నారు. వచ్చే ఏడాది జనవరి మాసంలో బంగ్లాదేశ్ వేదికగా జరిగే అంతర్జాతీయ కరాటే పోటీలకు వెన్నెల ఎంపికవడంతో ఆమెకు తన కోచ్ సింహాచలం మరింత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. అతి త్వరలో ఏషియా కరాటే పోటీల్లో పాల్గొని, ఆ తర్వాత ఇండియా తరఫున ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొనడమే లక్ష్యంగా కరాటే శిక్షణ తీసుకుంటున్నట్లు వెన్నెల స్పష్టం చేశారు.

వెన్నెలకు తుడా చైర్మన్ అభినందనలు

కరాటే చాంపియన్ షిప్ పోటీలలో అత్యంత ప్రతిభను కనబరచి స్వర్ణ, వెండి పతకాలు సొంతం చేసుకున్న చిన్నారి వెన్నెలను సోమవారం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కుంట్రపాకం నుంచి జాతీయ స్థాయి కరాటే పోటీలకు హాజరై విజేతగా నిలవడం నిజంగా అభినందనీయమని, భవిష్యత్తులో మరెన్నో విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. అందుకోసం తన వంతు సాయంగా ఏది కావాలన్నా అందిస్తానని ఆ చిన్నారికి హామీ ఇచ్చారు.